## క్లుప్తంగా

### డిప్యూటీ సీఎం పరామర్శ



వంటాకు శ్రీను ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న డిప్యూటీ సీఎం బూడి

**దేవరాపల్లి:** నాగయ్యపేట వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఎంపీటీసీ వంటాకు పైడితల్లమ్మ భర్త శ్రీనును డిప్యూటీసీఎం బూడి ముత్యాలనాయుడు గురువారం పరామర్శించారు. తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది శ్రీను ఇటీవల ఇంటికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న డిప్యూటీ సీఎం అతడి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నాయకులు జామి గోవింద, తమటపు శంభునాయుడు, కొమ్మినేని సన్యాసినాయుడు, బీలా ఈశ్వరరావు, అల్లు సన్యాశిరావు, జాగరపు లక్ష్మీ, దాసరి మంగునాయుడు, కె.ఎస్. అప్పలనాయుడు పాల్గొన్నారు.

### ప్రతి ఇంటికీ తాగునీరు లక్ష్యం



తామరంలో ఎంపీటీసీ నిధులతో నిర్మిస్తున్న బోరు

**మాకవరపాలెం:** ప్రతి ఇంటికీ తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి అన్నారు. తామరంలో జల్ జీవన్ మిషన్ పనులను గురువారం ఆమె పరిశీలించారు. త్వరితగతిన ఈ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. తామరంలో ఎంపీటీసీ నిధులతో మంజూరైన నూతన బోరు నిర్మాణ పనులను తూర్పుకాపు సంఘ మండల అధ్యక్షుడు గొంతిన హరిబాబు ప్రారంభించారు. కార్యదర్శి బాలదొర, పీఏసీఎస్ డైరెక్టర్ ద్వారపురెడ్డి అయ్యన్న పాల్గొన్నారు.

### ఉత్సాహంగా పంద్రాగస్టు పోటీలు



వాలీబాల్ పోటీలో హోరా హోరీగా తలపడుతున్న విద్యార్థులు

**దేవరాపల్లి:** మండల వ్యాప్తంగా పంద్రాగస్టు పోటీలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, రన్నింగ్, తదితర పోటీలను విద్యార్థినులకు, విద్యార్థులకు వేర్వేరుగా వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణ క్రీడా పోటీలతో సందడిగా మారింది. ఇందులో విజేతలకు ఈ నెల 15న బహుమతులు ప్రదానం చేస్తారు.

### విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**నర్సీపట్నం:** ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జెడ్పీ హైస్కూల్, ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో నూతన విద్యా విధానం అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 12న ఆవిర్భావ దినోత్సవంలో బహుమతులు అందజేస్తామని జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ తెలిపారు.

### నగర సంకీర్తన వార్షికోత్సవం రేపు

**మాకవరపాలెం:** ఈ నెల 12న నగర సంకీర్తన వార్షికోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కమిటీ సభ్యులు తెలిపారు. తామరంలో వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో శనివారం నగర సంకీర్తన నిర్వహిస్తారు. దీనిని ప్రారంభించి 11 ఏళ్లు పూర్తయిన సందర్భంగా శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు మాకవరపాలెం ఆర్టీసీ బస్టాండు నుంచి నగర సంకీర్తన నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కమిటీ సభ్యులు కోరారు.

# ఆదిలోనే 'నులి'మేద్దాం

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ
- విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



మాకవరపాలెం: విద్యార్థులకు మాత్రలు వేస్తున్న ఎంఈవో మూర్తి



చోడవరం రూరల్: విద్యార్థినికి మాత్ర వేస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



మాడుగుల: గాదరాయిలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ రాజారామ్

**చోడవరం రూరల్:** చిన్నారుల్లో బలహీనత, అజీర్తి, రక్తహీనత, బరువు తగ్గడం, కడుపునొప్పి, విరేచనాలు, వాంతులను కలిగించే నులి పురుగులను ఆదిలోనే నులిమేయాలని, అందుకు ఆల్బెండజోల్ మాత్రలను ఏడాదిలో రెండు దఫాలు విధిగా అందివ్వాలని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా గురువారం స్థానిక జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు ఆయన పంపిణీ చేశారు. గవరవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డి.దమయంతీదేవి, ఎంపీపీ గాడి కాసు శ్రీను, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్, ఓరుగంటి నెహ్రూ, పాల్గొన్నారు.

**లక్ష్మీపురంలో....**

లక్ష్మీపురం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు నులి పురుగుల కారణంగా ఆరోగ్యపరంగా కలిగే నష్టాల పట్ల అవగాహన కల్పించారు. సర్పంచ్ ఎస్.విజయ కమల గంగాభవాని, మాజీ సర్పంచ్ ఆదిగణపతి నాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ జి.వెంకటరావు, ఏఎన్ఎం లక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు పాల్గొన్నారు. మండలంలో 44 పాఠశాలలు, 17 కళాశాలలు, 54 అంగన్‌వాడీ కేంద్రాల్లో 12,839మంది విద్యార్థులకుగాను 12,382 మందికి ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశామని గవరవరం పీహెచ్‌సీ వైద్యాధికారి దమయంతీదేవి తెలిపారు. మిగిలిపోయిన విద్యార్థులకు ఈ నెల 17న మా హక్కు పథకంలో భాగంగా అందజేస్తామన్నారు.

**నులిపురుగుల నివారణ మాత్రలు అందించండి**

**బుచ్చెయ్యపేట:** నులిపురుగుల నివారణ మాత్రలు విద్యార్థులందరికీ అందించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం వడ్డాదిలో ఆయన విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ ప్రారంభించారు. ఫ్యామిలీ డాక్టరులో భాగంగా వైద్యులు తప్పనిసరిగా అంగన్‌వాడీ, పాఠశాలల్లో విద్యార్థులను పరీక్షించి రక్త హీనత, అనారోగ్యంతో ఉన్న వారికి తక్షణ వైద్య సేవలు అందేలా చూడాలని ఆదేశించారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణ మూర్తి, సర్పంచ్ కామలక్ష్మి సూరి అప్పారావు పాల్గొన్నారు.

**నులిపురుగుల నివారణతో సంపూర్ణ ఆరోగ్యం**

**రావికమతం:** నులిపురుగుల నివారణతో ప్రతి విద్యార్థి సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి తెలిపారు. జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా కొత్తకోట, రావికమతం హైస్కూళ్లలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. వాటి ప్రయోజనాలను వివరించారు. భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రపర్చుకోకపోతే పొట్టలో నులిపురుగులు పెరుగుతాయన్నారు. ఇవి పెరగడం వల్ల రక్త హీనతతోపాటు చాలా సమస్యలు ఏర్పడతాయన్నారు. ప్రతి విద్యార్థి ఆర్నెల్లకోసారి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకుంటే ఈ సమస్యను అధిగమించవచ్చన్నారు. వైద్యాధికార్లు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

**4500 మందికి మాత్రల పంపిణీ**

**మాకవరపాలెం:** మండలంలో 4500 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మాకవరపాలెం, బూరుగుపాలెం పీహెచ్‌సీల పరిధిలో 5,470 మందికి గాను 4,500 మందికి ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్టు వైద్యాధికారి శ్రీవిద్య తెలిపారు. మిగిలిన వారికి ఈ నెల 17న వేస్తామన్నారు. జి.వెంకటాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఎంఈవో మూర్తి విద్యార్థులకు మాత్రలు వేశారు.

**కె.కోటపాడు:** మండలంలోని చౌడువాడ, గొండుపాలెం హైస్కూళ్లు, పాచిలవానిపాలెం ఎంపీపీ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. ఈ కార్యక్రమాన్ని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల పర్యవేక్షించారు. పీహెచ్‌సీ పరిధిలో 5,327 మందికి మాత్రలను వేయడాన్ని లక్ష్యం పెట్టుకోగా 4,870 మందికి వైద్య సిబ్బందితో వేయించారు. చౌడువాడ హైస్కూల్ హెచ్‌ఎం ఈర్లి అప్పారావు పాల్గొన్నారు.

**మాడుగుల/మాడుగుల రూరల్:** కింతలి పీహెచ్‌సీ పరిధి గాదిరాయిలో చిన్నారులకు వైస్ ఎంపీపీ రాజారామ్ అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో 4,389 మందికి మాత్రలు పంపిణీ చేయాల్సి ఉండగా, శతశాతం పూర్తి చేశామని వైద్యాధికారి కె. ఎం. నాయుడు తెలిపారు. కె.జె.పురం పీహెచ్‌సీ పరిధిలో 6,500 మందికి గాను 4,252 మందికి మాత్రలు వేసినట్లు వైద్యాధికారి ఎల్. శివప్రసాదుపాత్రుడు తెలిపారు.

**చీడికాడ:** ప్రతి విద్యార్థికి మాత్రలు అందించాలని ఎంపీపీ కురచా జయమ్మ తెలిపారు. చీడికాడ ఉన్నత పాఠశాలలో ఆమె విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు.



కె.కోటపాడు: చౌడువాడ హైస్కూల్లో మాత్రలను వేస్తున్న వైద్యాధికారి నిర్మల



రావికమతం: కొత్తకోటలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి



చోడవరం రూరల్: లక్ష్మీపురంలో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

## ప్రగతిని తెలిపేందుకే సమావేశాలు



జి.వెంకటాపురంలో విద్యార్థిని అభినందిస్తున్న ఎంఈవో మూర్తి



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి

**మాకవరపాలెం:** విద్యార్థుల ప్రగతిని తెలియజేసేందుకే తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేశామని ఎంఈవో మూర్తి తెలిపారు. మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ గురువారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల ఫార్మేటివ్ పరీక్షల్లో విద్యార్థులకు వచ్చిన మార్కులను తెలియజేశారు. అధిక మార్కులు వచ్చిన విద్యార్థులను అభినందించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులను ఎంఈవో ఆదేశించారు. కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**ప్రతి విద్యార్థి చదువుపై ప్రత్యేక శ్రద్ధ**

**కె.కోటపాడు:** విద్యార్థినుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నాగలక్ష్మి ఉపాధ్యాయినులకు సూచించారు. స్థానిక కేజీబీవీలో గురువారం తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇటీవల ఫార్మేటివ్ పరీక్షల్లో విద్యార్థినులకు వచ్చిన మార్కుల వివరాలను తల్లిదండ్రులకు వివరించారు. చదువుల్లో వెనుకబడిన వారికి గుర్తించి ప్రత్యేక తరగతులతో మంచి మార్కులు వచ్చేలా చర్యలను తీసుకుంటున్నట్లు తెలిపారు.

## నా భూమి-నా దేశం కార్యక్రమం



బంగారుమెట్టలో స్వాతంత్య్ర సమరయోధులను సత్కరిస్తున్న నాయకులు



రావికమతం: కొత్తకోటలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రజా ప్రతినిధులు, పోలీసులు, ఉద్యోగులు

**బుచ్చెయ్యపేట/రోలుగుంట/రావికమతం/దేవరాపల్లి:** ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి నా దేశం కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్ట, పొట్టిదొరపాలెం తదితర గ్రామాల్లోని చెరువుల గట్లపై మొక్కలు నాటి, నేల తల్లికి నమస్కారాలు చేసి పలువురు దేశ నాయకులకు వందనాలు చేశారు. స్వాతంత్య్ర సమరయోధులను సత్కరించారు. వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్‌లు మేరుగు కుమారి బాబూరావు, దరిమిశెట్టి యశోద అప్పలనాయుడు, ఏపీవో మురళి పాల్గొన్నారు. రావికమతం మండలం కొత్తకోట పీహెచ్‌సీలో ఎస్ఐ విభీషణరావు, సర్పంచ్ కోన లోవరాజు, ఉప సర్పంచ్ పందల దేవా, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి గుమ్ముడు దొరబాబు ప్రతిజ్ఞ చేశారు. అక్కడ ఆవరణలో మొక్కలు నాటారు. సీనియర్ సిటిజన్స్ బేతా నూకరాజు, గుమ్ముడు ప్రకాషరావు, పాణిగ్రాహి తదితరులను సన్మానించారు. రోలుగుంట మండలం కొవ్వూరులోని చెత్తతో సంపద తయారీ శాలలో 75 మొక్కలను నాటారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ యర్రంశెట్టి కాంతమ్మ ప్రారంభించారు. ఏరియా సాంకేతిక సహాయకుడు అసరయ్య, మహిళా సంరక్షణ కార్యదర్శి వరలక్ష్మి పాల్గొన్నారు. దేవరాపల్లి మండలం తెనుగుపూడి, గరిశింగి, మారేపల్లి, వెంకటరాజుపురం, వాకపల్లి, తిమిరాం, కలిగొట్ల గ్రామాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వాతంత్య్రం సిద్ధించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 75 మొక్కలు నాటారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ జి. సంతోషి నళిని, సర్పంచ్‌లు గూడెపు రాము, అవుగడ్డ కన్నతల్లి, దాసరి సంతోష్‌కుమార్, బుగత రాజేశ్వరి, రెడ్డి సూర్యనారాయణ, గొర్రుపోటు సుధారాణి, తెనుగుపూడి ఉప సర్పంచ్ కాటిపాం పెదనాయుడు పాల్గొన్నారు.

### నవధాన్యాల కిట్ల పంపిణీ



నవధాన్యాల కిట్లు పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ శాఖ మాస్టర్ ట్రైనర్ బత్తి దేవి

**రోలుగుంట:** ఎస్సీ కార్పొరేషన్ సౌజన్యంతో శరభవరంలో 23 మందికి నవధాన్యాల కిట్లు ప్రకృతి వ్యవసాయ శాఖ మాస్టర్ ట్రైనర్ బత్తి దేవి, వైస్ ఎంపీపీ దోసపత్ని వరలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ మాట్లాడుతూ 2021 ప్రభుత్వ వ్యవసాయంలో భాగంగా ఆకు కూరలు, కూరగాయలు, గట్లపై కంది పంట వేసి సాగు పద్ధతులు పాటించి ఫలసాయం పొందడంలో మంచి గుర్తింపు లభించిందన్నారు. ఈ జాబితాను ప్రభుత్వానికి నివేదించడంతో ఎస్సీ కార్పొరేషన్ సహకారం అందిందన్నారు. వీటిని గమనంలో ఉంచుకుని గుర్తింపు పొందిన రైతులను మిగిలిన వారు ఆదర్శంగా తీసుకొని ఈ విధమైన సంక్షేమం పొందాలని కోరారు. సర్పంచ్ పంచాడ చంద్ర, రైతులు సాంబమూర్తి, నాగకాంతం, సాయిలక్ష్మి పాల్గొన్నారు.

### రాయితీపై గడ్డి విత్తనాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీ చిట్టినాయుడు

**మాడుగుల:** మాడుగులలో గురువారం పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ వి. చిట్టినాయుడు మాట్లాడుతూ ఐదు కిలోల గడ్డి విత్తనాలు రూ.340 కాగా, రాయితీ రూ.255 పోను రూ.85కే అందిస్తామన్నారు. లింగనిర్ధారణ, సంపూర్ణ మిశ్రమ దాణా, 1,962 అంబులెన్స్, కిసాన్ క్రెడిట్ కార్డులు, తదితరవి వివరించారు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ సౌజన్య పాల్గొన్నారు.

### విజయోత్సవ సభను జయప్రదం చేయాలి

**రావికమతం:** చోడవరంలో ఈ నెల 13న జరిగే గడపగడపకు మన ప్రభుత్వం విజయోత్సవ సభను పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని ఎంపీపీ పైల రాజు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ముక్కా మహలక్ష్మీనాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ కోరారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నియోజకవర్గంలోని అన్ని గ్రామాలు, బూత్ లెవెల్లో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ విజయవంతంగా పూర్తి చేశారన్నారు. దీన్ని పురస్కరించుకుని నిర్వహించే సభకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.


### జిల్లా ఎ.ఐ.ఎం నూతన కార్యవర్గం ఎన్నిక

**మాడుగుల రూరల్:** అనకాపల్లి జిల్లా ఎ.ఐ.ఎం. నూతన కార్యవర్గం ఏర్పాటైంది. జిల్లా కన్వీనర్‌గా పెంకి శివ, అధ్యక్షుడిగా కుంచెల చినదేముడు, ఉపాధ్యక్షుడిగా నేతల బోగేష్, కార్యదర్శిగా గొంది అప్పారావు, కో కన్వీనర్‌గా సాల్మన్‌రాజు, సరమండ వీరబాబు, రావాడ ప్రకాష్, మర్రా రాజు, తీటి నూకరాజు, మీడియా కన్వీనర్‌గా మెరుగు శేఖర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

### విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలి

**నర్సీపట్నం:** విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎంఈవో సిహెచ్.తలుపులు పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్(మెయిన్)లో తల్లిదండ్రుల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఎఫ్1 పరీక్షల్లో విద్యార్థులు సాధించిన మార్కులు, హాజరు అంశాలను తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లారు. చదువుతోపాటు మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి తల్లిదండ్రుల సహకారం ఉండాలన్నారు. హెచ్‌ఎం రత్నం, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

### చీడపీడల నివారణకు కషాయం మేలు



కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

**నాతవరం:** పంటల్లో చీడపీడల నివారణకు దశకర్ణిక కషాయం ఉపకరిస్తుందని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వై.భవానీ అన్నారు. రామన్నపాలెంలో ఎన్‌పీఎస్ షాపు వద్ద గురువారం రైతులకు కషాయం తయారీపై అవగాహన కల్పించారు. ఈ కషాయం ఆర్నెల్ల పాటు నిల్వ ఉంటుందని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. పంటను తొలిచేస్తున్న పురుగు నిర్మూలనకు కషాయం ఉపకరిస్తుందని చెప్పారు. సిబ్బంది చిన్న, గోపాల్ పాల్గొన్నారు.

## రూ.1.29 కోట్లతో పెదబొడ్డేపల్లి కోనేరు సుందరీకరణ



కోనేరు సుందరీకరణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణేష్

**నర్సీపట్నం:** మున్సిపాలిటీలోని పెదబొడ్డేపల్లి శివాలయం కోనేరును రూ.1.29 కోట్లతో సుందరంగా తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పేర్కొన్నారు. సుందరీకరణ పనులను గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోనేరును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అమృత్-2 కింద నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో వాకింగ్ ట్రాక్, ఉద్యానవనంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. కోనేరు మధ్యలో శివలింగాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. పనులన్నీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, ముస్లిం కార్పొరేషన్ షేక్ ఉన్నీషా బేగం, కోఆప్షన్ సభ్యురాలు షేక్ రోజా, పార్టీ నాయకులు కొణతాల వరలక్ష్మి, కణితి అన్నపూర్ణ, లోకవరపు శారద పాల్గొన్నారు.

## ఉప ఎన్నికకు ముగిసిన నామినేషన్ల పర్వం



బుచ్చెయ్యపేటలో ఎన్నికల అధికారి కామేశ్వరరావుకు నామినేషన్ అందిస్తున్న లక్ష్మి



నామినేషన్ల జాబితాను నోటీస్ బోర్డులో అంటిస్తున్న ఈఆర్వో ప్రసాద్, ఎంపీడీవో సుబ్బలక్ష్మి

**బుచ్చెయ్యపేట:** సర్పంచ్ ఉప ఎన్నికకు సంబంధించి నామినేషన్లు పర్వం ముగిసింది. బుచ్చెయ్యపేట సర్పంచ్ అభ్యర్థిగా సుంకరి లక్ష్మి నామినేషన్ వేశారు. ఇక్కడ సర్పంచ్ సుంకరి సూరిబాబు గతేడాది నవంబర్‌లో ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. తాజా ఎన్నికల నోటిఫికేషన్ మేరకు గురువారం ఆమె ఎన్నికల అధికారి కామేశ్వరరావుకు నామినేషన్ పత్రం అందించారు. బుచ్చెయ్యపేట సర్పంచ్ పదవిని మృతుడు సూరిబాబు భార్యకే తిరిగి అప్పగించాలని గ్రామస్తులు తీర్మానించడంతో మరెవరూ నామినేషన్ వేయకపోవడంతో ఆమె ఎన్నిక ఏకగ్రీవం కానుంది.

**ఎస్.గజపతినగరం-1, నాగయ్యపేట-2**

**దేవరాపల్లి:** మండలంలో రెండు పంచాయతీ వార్డు సభ్యుల ఉప ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు పర్వం గురువారంతో ముగిసింది. ఈ మేరకు ఎస్.గజపతినగరం 3వ వార్డుకు ఆదిరెడ్డి సన్యాసమ్మ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. నాగయ్యపేటలోని 7వ వార్డుకు సింగంపల్లి సత్యవతి, ఆదిరెడ్డి లక్ష్మి నామినేషన్లు దాఖలు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.వి.వి.ఎస్. ప్రసాద్, పరిపాలన అధికారి జి.వి.రమణ నామినేషన్లు దాఖలు చేసిన వివరాలతో కూడిన జాబితాను నోటీస్ బోర్డులో అతికించారు. శుక్రవారం స్క్రూటినీ ప్రక్రియ జరుగుతుందని వారు తెలిపారు.

**వార్డు మెంబర్ స్థానానికి నామినేషన్ దాఖలు**

**కె.కోటపాడు:** ఆర్లి గ్రామ పంచాయతీలో ఆరో వార్డు స్థానానికి ఒక నామినేషన్ దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి మీనాకుమారి గురువారం తెలిపారు. గ్రామ వార్డు మెంబర్ మరణించడంతో వార్డు ఎన్నిక నిర్వహణ చేపట్టారు. ఈ వార్డుకు గ్రామానికి చెందిన బండారు కిశోర్ ఒక్కరే నామినేషన్ వేశారన్నారు. శుక్రవారం నామినేషన్ స్క్రూటినీ చేస్తామన్నారు.

## సీఎల్సీ చర్చి సేవలు అభినందనీయం

- ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



విద్యార్థులకు కంచాలు అందిస్తున్న విప్ ధర్మశ్రీ, మహంతి

**బుచ్చెయ్యపేట:** గ్రామీణ ప్రాంతాల్లో పేదల అభ్యున్నతికి సీఎల్సీ చర్చి చేస్తున్న సేవలు అభినందనీయమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. వడ్డాది కోవెల అప్పనదొర జెడ్పీ హైస్కూల్‌కు చెందిన 500 మంది విద్యార్థులకు సీఎల్సీ చర్చి అధినేత సుధీర్‌కుమార్ మహంతి స్టీల్ కంచాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ సీఎల్సీ చర్చి ఆధ్వర్యంలో వడ్డాది హైస్కూల్‌లో కుట్టు మిషన్లు ఏర్పాటు చేయించి విద్యార్థుల తల్లిదండ్రులకు కుట్టుమిషన్‌లో శిక్షణ అందిస్తామన్నారు. ప్రజా సేవకు అంకితమైన ఎస్.కె. మహంతికి చట్ట సభల్లో అవకాశం కల్పించి ఎమ్మెల్సీ పదవి వచ్చేలా కృషి చేస్తామన్నారు. దిబ్బిడి, బుచ్చెయ్యపేట తదితర గ్రామాల విద్యార్థులకు కంచాలు అందిస్తామని సీఎల్సీ చర్చి అధినేత మహంతి తెలిపారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి తదితర్లు మహంతి దంపతులను ఘనంగా సత్కరించారు. చర్చి నిర్వాహకుడు రాబర్ట్ మహంతి, సర్పంచ్ కోరుకొండ కామలక్ష్మి సూరి అప్పారావు, ఎంపీటీసీలు కోరుకొండ లీలావతి రమణ, ఇంటి అప్పారావు, కోఆపరేటివ్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, సాయం రమేష్, నాయకులు గుమ్మిడి ప్రసాద్, తలారి శంకరావు, హెచ్‌ఎం శేషుబాబు పాల్గొన్నారు.

## వేచలంలో బోర్లు తవ్వకానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ కర్రి సత్యం, సర్పంచ్ శరారినాయుడు

**దేవరాపల్లి:** డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆదేశాలతో వేచలంలోని బడబడల, నౌడు వారి కల్లాలకు మంచినీటి బోర్లు తవ్వకానికి జెడ్పీ గ్రాంట్ నుంచి ఒక్కొక్క బోరుకు రూ.లక్ష చొప్పున మంజూరు చేశామని జెడ్పీటీసీ కర్రి సత్యం తెలిపారు. ఈ బోర్లు తవ్వకానికి సర్పంచ్ నాగిరెడ్డి శరారినాయుడు, కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఆర్.వి.కె. నాయుడులతో కలిసి ఆయన గురువారం భూమి పూజ చేశారు. ఎన్నోయేళ్ల నాటి మంచినీటి సమస్యను పరిష్కరించిన డిప్యూటీ సీఎంకు స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు. వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు వేచలపు చిన్నంనాయుడు, బడబడల నాయుడుబాబు, వేచలపు సూరిబాబు, రెడ్డి అక్కుంనాయుడు పాల్గొన్నారు.